
రద్దీతో రోడ్డుపై నిలిచిన వాహనాలు


మల్లన్న ఆలయానికి తరలివస్తున్న భక్తులు

నేడే కొమురవెల్లి మల్లన్న పట్నంవారం

మూట, ముల్లెతో మల్లన్న చెంతకు

- ప్రారంభంకానున్న జానపదుల మహాజాతర
- భక్తులతో కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- వసతిగదులు దొరక్క భక్తుల ఇబ్బందులు
- రేపటి అగ్నిగుండాలకు తోటబావి ప్రాంగణంలో ఏర్పాట్లు


క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు


ఒడిబియ్యం తీసుకెళ్తున్న భక్తురాలు

చేర్యాల, జనవరి 20: జానపదుల జనజాతరకు ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం సంసిద్ధమైంది. జాతరలో మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా పిలుస్తున్న క్రమంలో మల్లన్న దర్శనార్థం హైదరాబాద్‌కు చెందిన వేలాదిమంది భక్తులు ఇంటిల్లిపాది శనివారం సాయంత్రానికి మూటముల్లెతో కొమురవెల్లికి చేరుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

నేరుగా ధూళి దర్శనం

భక్తులు కాళ్లు, చేతులు శుభ్రపరుచుకోకుండానే నేరుగా స్వామివారిని ధూళి దర్శనం చేసుకుని ఒడిబియ్యాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా ఆదివారం మల్లన్నకు బోనాలు, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మల్లన్న ఆలయ గుట్టపై ఉన్న ఎల్లమ్మ దేవతకు బోనాలు నివేదించనున్నారు. సోమవారం తోటబావి ప్రాంగణంలో హైదరాబాద్ యాదవసంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం, అగ్నిగుండాలు నిర్వహించనున్నారు. స్నానాలకోసం తోటబావి, కోడెల స్తంభం, మల్లన్న చెరువు సమీపంలో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ సిద్ధం చేశారు. భక్తులు బసచేసే పలు ప్రదేశాలకు సమీపంలో నల్లాలు నిర్మించగా, మిషన్ భగీరథ ద్వారా గోదావరి జలాలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. వీఐపీల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటుచేశారు. భక్తుల సౌకర్యార్థం లడ్డూ ప్రసాదాన్ని సైతం తయారుచేసి సిద్ధం చేశారు.

చుక్కలనంటిన ప్రైవేటు గదుల అద్దె

ఆలయ పరిధిలోని గదులను దాతలకు కేటాయించగా, భక్తుల రద్దీ కారణంగా ప్రైవేటు గదుల యజమానులు మూడురోజులకు రూ.4-8వేల చొప్పున అడ్డగోలుగా వసూలు చేశారు. చిన్నపాటి ఖాళీస్థలంలో తడకలు అడ్డుపెట్టి రూ.2వేలు చొప్పున అద్దెకు ఇచ్చారు. ఆర్థిక స్థోమత లేనివారు ఆరుబయట ప్రదేశాల్లో గుడారాలు వేసుకోగా, మరికొంతమంది చెట్ల నీడన తలదాచుకున్నారు.

అడ్డగోలుగా ఫ్లెక్సీల ఏర్పాటు

ఆలయ రాజగోపుర ఆవరణలో పలువురు ఇష్టానుసారం ఫ్లెక్సీలు ఏర్పాటుచేయడంతో రాజగోపురం కనిపించక భక్తులు ఉసూరుమంటున్నారు. అంతేకాకుండా ప్రసాద విక్రయశాల, దర్శనం చేసుకుని వెనుదిగిరివచ్చే మార్గంతో పాటు పరిసరాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు గాలిదుమారానికి విరిగిపడితే భక్తులు గాయాలపాలయ్యే అవకాశం లేకపోలేదు. ఈ విషయమై ఆలయాధికారులు స్పందించి ఫ్లెక్సీలను తొలగించి భక్తులకు దోహదపడే సమాచార ఫ్లెక్సీలు నెలకొల్పాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కింగ్ నుంచి కానరాని ఉచిత వాహన సౌకర్యం

కొమురవెల్లి శివారులోనే వాహనాలను నిలుపుదల చేసిన నేపథ్యంలో పార్కింగ్ నుంచి భక్తులను ఆలయం వరకు తీసుకొచ్చేందుకు ఉచిత వాహన సౌకర్యం ఏర్పాటు చేయాలని సమీక్షా సమావేశంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. కానీ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో భక్తులు మూట ముల్లె నెత్తినపెట్టుకుని వంట సామాగ్రి చేతపట్టుకుని నడుచుకుంటూ వస్తూ నానా తంటాలు పడ్డారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలు
- దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 5796
- పరీక్షకు హాజరైన వారు 3703 మంది

6లో

భక్తులతో పోలీసులు మర్యాదగా ప్రవర్తించాలి

- సిద్దిపేట సీపీ అనురాధ
- పట్నంవారం సందర్భంగా సిబ్బందికి సూచనలు


సిబ్బందికి బందోబస్తు చర్యలను వివరిస్తున్న సిద్దిపేట సీపీ అనురాధ

చేర్యాల, జనవరి 20: కొమురవెల్లి మల్లన్న భక్తులతో పోలీసులు మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆది, సోమవారాల్లో జరగనున్న పట్నంవారం సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై శనివారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. ప్రతీ ఒక్కరూ విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని, భక్తులకు ఇబ్బంది కలగకుండా బందోబస్తు నిర్వహించాలని సూచించారు. రోడ్లపై వాహనాలు నిలపకుండా తనిఖీలు చేస్తూ పార్కింగ్ ప్రదేశాలకు తరలించాలని, 24 గంటలూ నిఘాపెట్టాలని తెలిపారు. 80 సీసీ కెమెరాలతో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అడిషనల్ డీసీపీ-2, ఏసీపీ-4, సీఐ-14, ఎస్ఐ-28, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా హోంగార్డులు, బీడీ టీమ్స్, యాక్సెస్ కంట్రోల్, రోప్ పార్టీ మొత్తం 510 మంది సిబ్బందితో పాటు 50 మంది ఎన్‌సీసీ స్టూడెంట్స్‌తో పటిష్ఠమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీపీ అనురాధ స్పష్టం చేశారు. అనంతరం కొమురవెల్లి నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అంది శ్రీనివాస్‌రావు, ఎస్.మల్లారెడ్డి, ఏఆర్ అడిషన్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను అడిగి రిజిస్ట్రేషన్ చేస్తా!

- కుటుంబీకుల అంగీకారంతో స్లాట్ బుక్ చేసుకున్నా రిజిస్ట్రేషన్‌కు తహసీల్దార్ కొర్రీలు
- తహసీల్ కార్యాలయంలో మహిళల నిరసన
- ఎట్టకేలకు సాయంత్రం 5 తర్వాత రిజిస్ట్రేషన్ పూర్తి


రిజిస్ట్రేషన్ చేయకుండా కొర్రీలు పెట్టడంతో కార్యాలయంలోనే నిరసన తెలుపుతున్న మహిళలు

మద్దూరు, జనవరి 20 : తమ భర్తల అంగీకారంతో కుటుంబపరంగా వాటాగా వచ్చే భూమికి స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన మహిళలకు కలెక్టర్‌ను అడిగాకే రిజిస్ట్రేషన్ చేస్తానంటూ తహసీల్దార్ ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో సదరు మహిళలు శనివారం మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో నిరసన తెలిపారు. బాధిత మహిళలు తెలిపిన వివరాల మేరకు తమ మామ అయిన బర్మ బాలయ్యకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు బర్మ మల్లేశం మృతిచెందాడు. రెండో కుమారుడు రాజు, మూడో కుమారుడు స్వామి బతుకుదెరువు కోసం లారీ డ్రైవర్లుగా పని చేస్తూ ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అయితే బర్మ బాలయ్య పేర నాలుగు ఎకరాల భూమి ఉంది. ముగ్గురు కొడుకుల పేర సమ భాగాలుగా ఎకరం చొప్పున రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పాడు. అందుకు ఇద్దరు కొడుకులు తమ పేర కాకుండా కోడళ్ల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాలని తండ్రి బాలయ్యకు సూచించారు. ఈ మేరకు బాలయ్య ముగ్గురి కోడళ్ల పేర ఎకరం చొప్పున శనివారం భూమి రిజిస్ట్రేషన్ చేయించేందుకు గురువారమే స్లాట్ బుక్ చేయించాడు. శనివారం కార్యాలయానికి రాగా తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయకుండా కొర్రీలు పెడుతూ "మీ భర్తలు వచ్చి సాక్షి సంతకం పెడితేనే రిజిస్ట్రేషన్ చేస్తానని, జిల్లా కలెక్టర్‌ను అడిగాకే రిజిస్ట్రేషన్ చేస్తానని" చెప్పడంతో వారు ఆందోళనలో పడ్డారు. తన కొడుకుల సూచన మేరకే తన కోడళ్ల పేర భూమి రిజిస్ట్రేషన్ చేసేందుకు స్లాట్ బుక్ చేశానని బాలయ్య విన్నవించినా తహసీల్దార్ అనంతరెడ్డి వినిపించుకోలేదు. "నీకు ఈ భూమి మీ అమ్మగారి నుంచి వచ్చింది కాబట్టి నేను చేయను అంటూనే మీ కుమారుల చేత తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కాగితం మీద రాసి ఇచ్చిన తర్వాతనే రిజిస్ట్రేషన్" అంటూ ఖరాఖండిగా చెప్పారని, తమ కుమారుల చేత ఫోన్ చేయిస్తానని చెప్పినా వినిపించుకోలేదని బాలయ్య వాపోయాడు. వాయిస్ రికార్డు చేసుకుని అయినా రిజిస్ట్రేషన్ చేయాలని వేడుకున్నా పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ విషయమై తహసీల్దార్ అనంతరెడ్డి వివరణ కోరగా ఈ భూమి బాలయ్యకు వాళ్ల అమ్మగారి నుంచి వచ్చిందని, కుమారులు వచ్చి రాతపూర్వకంగా లెటర్ ఇవ్వాలన్నారు. లేదంటే కలెక్టర్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి విషయాల్లో తనకు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. చివరికి సాయంత్రం 5 గంటల వరకు కాలయాపన చేసి రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం.


కుకునూరుపల్లిలోని ప్రభుత్వ పాఠశాల

29న 'ఎస్‌ఎంసీ' ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల చేసిన విద్యాశాఖ
- 24న తుది జాబితా విడుదల
- దాదాపు నాలుగేళ్ల తర్వాత ఎన్నికల నిర్వహణ

కొండపాక, జనవరి 20: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికల సందడి మొదలైంది. శనివారం ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. అన్ని పాఠశాలల్లో 24న తల్లిదండ్రుల తుది జాబితా విడుదల చేస్తారు. ఈ నెల 29న ఎన్నికలు నిర్వహిస్తారు. ఎట్టకేలకు నాలుగేళ్ల అనంతరం ఎస్‌ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులను భాగస్వాములను చేసి పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్ కోసం ఎస్‌ఎంసీ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి రెండేళ్లకోసారి ఈ ఎన్నికలు నిర్వహించాలి. కానీ 2019 చివరిసారిగా ఎన్నికలు జరిగాయి. తర్వాత కాల పరిమితిని పెంచుతూ వచ్చింది. ఈనెల చివరివరకు కాల పరిమితి ఉండడంతో ఎన్నికలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉత్తర్వులు రావడంతో అన్ని పాఠశాలల్లో నోటిఫికేషన్ జారీచేశారు.

24న తల్లిదండ్రుల తుది జాబితా

పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాపై ఈ నెల 22, 23 తేదీల్లో అభ్యంతరాలను స్వీకరిస్తారు. 24న తేదీ జాబితా పాఠశాలలో వేస్తారు.

29న సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

ఈ నెల 29న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్‌ఎంసీ సభ్యుల ఎన్నిక జరుగుతుంది. 1:30 తర్వాత ఎన్నికైన ఎస్‌ఎంసీ సభ్యులు చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక. అనంతరం తొలి సమావేశం నిర్వహిస్తారు. 50 శాతం తల్లిదండ్రులు ఎన్నికలు నిర్వహించే సమావేశానికి హాజరుకావాలి. చేతులెత్తే పద్ధతి ద్వారా ఎన్నికలను నిర్వహించాలి.

ఎస్‌ఎంసీ కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయుడు

సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమిటీకి కన్వీనర్‌గా ఉంటాడు. కమిటీలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా పాఠశాలలోనే ఒక ఉపాధ్యాయుడు, సదరు పాఠశాల ఉన్న వార్డు సభ్యుడు, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్‌ఎం మహిళా సమైక్య అధ్యక్షురాలుగా ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు. అలాగే గ్రామాభివృద్ధికి పాటుపడే ఇద్దరు ఉన్నత విద్యావంతులు లేదా విశ్రాంత ఉద్యోగులకు కో ఆప్షన్ సభ్యులుగా అవకాశం ఉంటుంది.

విధి విధానాలు

1 నుంచి 8వ తరగతిలో ప్రతి తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను ఎంపిక చేస్తారు. ఇందులో ఒకరికి రిజర్వేషన్ వర్తింపజేయడం, ముగ్గురిలో ఇద్దరు మహిళలు తప్పనిసరిగా ఉండాలి. తల్లి లేదా తండ్రి మాత్రమే ఓటువేసే అవకాశం ఉంటుంది. ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతులకు 15 మంది సభ్యులు. ఇందులో ఐదుగురు పురుషులు, 10 మంది మహిళలు. ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 8 తరగతులు ఉంటే 24 మంది సభ్యులు ఉంటారు. ఇందులో 8 మంది పురుషులు, 16 మంది మహిళలు. ఉన్నత పాఠశాలలో అంటే 6, 7, 8 తరగతిలో మాత్రమే సభ్యులను తీసుకుంటారు. మొత్తం 9 మంది, ఇందులో ముగ్గురు పురుషులు, ఆరుగురు మహిళలు ఉంటారు.

జిల్లాలో 1018 పాఠశాలలు

సిద్దిపేట జిల్లాలో 1018 పాఠశాలలల్లో ఎన్నిక జరగనున్నది. 980 ప్రభుత్వ యాజమాన్యాల కింద ఉన్న పాఠశాలలు, 36 గురుకులాలు రెండు ఎయిడెడ్ పాఠశాలల్లో ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికలకు నోటిఫికేషన్ జారీచేశాం

-శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో

జిల్లాలోని ప్రభుత్వ అన్ని పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలకు ప్రణాళికలు రూపొందించాం. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు మొదలుపెట్టాం. శనివారం అన్ని పాఠశాలల్లో నోటిఫికేషన్ జారీ అయింది. పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తాం. తల్లిదండ్రులు పాల్గొని ఎన్నికలను విజయవంతం చేయాలి.

వేసవిలో నీటిఎద్దడి తలెత్తకూడదు

- ఇందుకోసం ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం
- విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- రైతు వేదికలను వినియోగంలోకి తేవాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 20 : వచ్చే వేసవికాలంలో నియోజవర్గంలోని ఏ గ్రామంలో కూడా నీటిఎద్దడి సమస్య ఉండకూడదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. దీని కోసం ఎన్ని నిధులైనా వెచ్చిస్తామని మంత్రి స్పష్టం చేశారు. శనివారం రాత్రి ఆయన హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 164 గ్రామాల్లో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్కూల్ భవనాలు, అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మహిళా సంఘ భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీలు ఇతర విద్యా సంస్థల్లో తాగునీటి సౌకర్యం, టాయ్‌లెట్స్ వంటి మౌలిక సదుపాయాల సమస్యలు లేకుండా చూడాలన్నారు. గ్రామం నుంచి మరో గ్రామానికి, మండలం నుంచి ఇతర మండలాలకు రోడ్డు కనెక్టివిటీ ఉండే విధంగా ప్రతిపాదనలు తయారు చేస్తే వాటికి నిధులు మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న రైతు వేదికలను ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


హుస్నాబాద్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ

హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సిద్దిపేట సీపీ అనురాధ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, శాంతి భద్రతలు తదితర అంశాలపై వారు చర్చించారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

- భర్తను హత్య చేయించిన భార్య
- మాజీ ప్రియుడితో కలిసి ఘాతుకం

- అందోలులో రాయితో కొట్టి కారులో ఎత్తుకెళ్లారు
- గొంతునులిమి ఊపిరాడకుండా చంపేశారు
- మెదక్ జిల్లా కోనాపూర్‌లో దహనమై లభించిన మృతదేహం
- భార్య, మాజీ ప్రియుడితో పాటు సహకరించిన నలుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి డీఎస్పీ రమేష్ కుమార్


మల్లేశం(ఫైల్)

జోగిపేట/రామాయంపేట, జనవరి 20 : మాజీ ప్రియుడిపై ఇష్టంతో ఓ మహిళ భర్తను దారుణంగా హత్య చేయించింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో భర్తను చంపేయించిన ఘటన శనివారం వెలుగుచూసింది. జోగిపేట పోలీస్‌స్టేషన్‌లోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంగారెడ్డి డీఎస్పీ రమేష్‌కుమార్ వివరాలను వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. జోగిపేటకు చెందిన చాకలి మల్లేశం(30)కు ఇటీవల అందోలులో డబుల్‌బెడ్రూం ఇల్లు మంజూరవడంతో భార్య కల్పనతో కలిసి అందులో నివసిస్తున్నాడు. మల్లేశం జోగిపేటలో ఇస్త్రీ దుకాణం నడుపుతున్నాడు. మల్లేశం భార్య కల్పనకు పెళ్లి కంటే ముందే తన చిన్ననాటి స్నేహితుడైన మచ్కూరి మహేశ్‌ను ప్రేమించింది. పెళ్లయిన తరువాత కూడా మహేశ్ ఆమెతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ క్రమంలో కల్పన తన భర్త మల్లేశంను హత్య చేయిస్తే తమకు అడ్డు ఉండదనుకున్నది. భర్తను మట్టుబెట్టాలని మచ్కూరి మహేశ్‌కు తెలిపింది. అతడు మరో ముగ్గురితో కలిసి హత్యకు పథకం పన్నాడు. వారికి కొంత సొమ్ము చెల్లించాలని మహేశ్ చెప్పడంతో ఆమె రూ.50 వేలు సుపారీ చెల్లించేందుకు ఒప్పుకున్నది. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున ఎప్పటిలాగే మల్లేశం తన ఇంటి నుంచి ఇస్త్రీ దుకాణానికి వెళ్లడానికి స్కూటీపై బయలుదేరాడు. ముందుగా రెక్కీ నిర్వహించి పథకం రచించిన దుండగులు అందోలులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వెనక దారిలోకి చాకలి మల్లేశం రాగానే తలపై బండరాయితో గట్టిగా బాదారు. దీంతో కింద పడిన మల్లేశంను మహేశ్‌తో పాటు అతడి స్నేహితులు ఉసికె అంబాజీ, రంగంపేటకు చెందిన ఒకరు, గంగారం గ్రామాలకు చెందిన ఇద్దరితో కలిసి కారులో కిడ్నాప్ చేశారు. వారు మల్లేశంను కారులోనే గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం మల్లేశం మతదేహాన్ని కారులో మొదటగా మెదక్ వైపు ఆ తర్వాత రామాయంపేట మీదుగా సిద్దిపేట రోడ్డులో తీసుకెళ్లారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధిలోని నిర్జనంగా ఉన్న కోనాపూర్ చెరువు వద్ద ఆగారు. మల్లేశం మృతదేహాన్ని ఆనవాలు లేకుండా చేసేందుకు పెట్రోల్ చల్లి నిప్పంటించి దహనం చేశారు. అయితే తన కుమారుడు కనిపించడం లేదంటూ మృతుడి తల్లి పాపన్నపేట రాజమణి శుక్రవారమే జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఇంతలో శనివారం ఉదయం రామాయంపేట మండలం కోనాపూర్ శివారు చెరువు కట్ట కింది భాగాన శవం పడి ఉన్నట్లు స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం వచ్చింది. రామాయంపేట ఎస్ఐ రంజిత్ ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కిడ్నాప్ కేసు గురించి తెలియడంతో జోగిపేట పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని మృతదేహం దహనమై లభించిందని వారికి తెలిపారు. జోగిపేట పోలీసులు వెళ్లిచూడగా మృతదేహం మల్లేశందేనని గుర్తించారు. దర్యాప్తులో భాగంగా, మొదటగా మల్లేశం భార్య కల్పనను పోలీసులు విచారించగా అసలు విషయాలు బయటపడ్డాయి. తనకు పెళ్లికి ముందే తమ గ్రామమైన మాసాన్‌పల్లికి చెందిన మచ్కూరి మహేశ్‌ను ప్రేమించానని పెళ్లి మల్లేశంతో జరిగినప్పటికీ, తనకు మహేశ్‌కు మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతూనే ఉందని కల్పన తెలిపింది. మృతుడి భార్య కల్పన వాంగ్మూలం మేరకు హత్యకు పాల్పడ్డ మహేశ్‌తోపాటు మల్లేశం భార్య కల్పన, హత్యకు సహకరించిన ఉసికె అంబాజీ, మరో ముగ్గురిని శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ రమేశ్ తెలిపారు. ఈ కేసును 24 గంటల్లో ఛేదించిన జోగిపేట సీఐ నాగరాజు, ఎస్ఐ అరుణ్ కుమార్‌గౌడ్, సిబ్బందిని డీఎస్పీ రమేశ్ అభినందించారు.


కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్









మహిళ ఆత్మహత్యాయత్నం

రామాయంపేట, జనవరి 20: భార్యాభర్తల గొడవల వల్ల ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టాయిలెట్లు శుభ్రంచేసే హార్పిక్ తాగిన అర్చన శనివారం రామాయంపేట ఆర్టీసీ బస్టాండులో అపస్మారక స్థితిలో పడిపోయింది. అక్కడే ఉన్న ప్రయాణికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. వెంటనే చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తరలించారు.







నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతం

- **ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలు**
- **దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 5796, పరీక్షకు హాజరైనవారు 3703 మంది**

వర్గల్, జనవరి 20: మానవ వనరులశాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుపుతున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఉమ్మడి మెదక్ (సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్) జిల్లాలవ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా ముగిసినట్లు వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డీ.రాజేందర్ తెలిపారు. నవోదయ 6వ తరగతి ప్రవేశానికి 80 సీట్లకు ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 5796 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 3703 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. 2093 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో 1501 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 933 మంది పరీక్ష రాశారు. సంగారెడ్డి జిల్లాలో 2113 మంది విద్యార్థులకు 1359 మంది, సిద్దిపేట జిల్లాలో 2182 మందికి 1411 మంది పరీక్ష రాశారని తెలిపారు. మెదక్ జిల్లాలో 568 మంది, సంగారెడ్డి జిల్లాలో 754 మంది, సిద్దిపేట జిల్లాలో 771 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థుల శాతం 63.89 కాగా గైర్హాజరైన విద్యార్థుల శాతం 36.11 అని చెప్పారు. గజ్వేల్ సెయింట్ జోసఫ్ బాలికల విద్యాలయంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులను గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ఎంఈవో సునీత పర్యవేక్షించినట్లు వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డీ.రాజేందర్ తెలిపారు.







మోడల్‌స్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోడల్ స్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం

హుస్నాబాద్, జనవరి 20: హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్‌లో శనివారం జాతీయ బాలికాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలికలపై అత్యాచారాలు, వాటికి సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఆర్.హరితారెడ్డి, సౌమ్య, వాసవి, నాగరాజు, మమత తదితరులున్నారు.

కొమురవెల్లి మల్లన్న భూములు కాపాడాలి



ఈవో బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, జనవరి 20: కొమురవెల్లి మల్లన్న ఆలయ భూములు కబ్జాకు గురికాకుండా పరిరక్షించాలని కోరుతూ సీపీఎం నాయకులు శనివారం ఆలయ ఈవో బాలాజీకి వినతిపత్రం అందించారు. గతంలో ఆలయం స్వాధీనమైన భూములను రాజకీయ నాయకుల అండదండలతో తిరిగి కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆలయ భూములకు హద్దులు నిర్ధారించి భక్తుల వసతుల కల్పనను మెరుగుపరచాలని కోరారు. ఇటీవల ఆలయంలో పునరుద్ధరణ కమిటీ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఏ హోదాలో అనుమతించారో సమాధానమివ్వాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, బాలకిషన్, మల్లేశం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కొమురవెల్లి- గౌరాయపల్లి క్రాస్ రోడ్డు

● కంకర వేసి బీటీని విస్మరించారు ● కనిపించని ప్రమాద హెచ్చరికలు ● బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మల్లన్న భక్తులకు తప్పని ఇక్కట్లు

చేర్యాల, జనవరి 20: కొమురవెల్లి మండలకేంద్రం శివారులోని గౌరాయపల్లి క్రాస్‌రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. రాజీవ్ రహదారి నుంచి కొమురవెల్లి వరకు కొన్నాళ్లక్రితం రూ.11కోట్ల వ్యయంతో విస్తరణ పనులు చేపట్టగా, గౌరాయపల్లి మూలమలుపు వద్ద రోడ్డు ఎత్తును పెంచారు. గౌరాయపల్లికి వెళ్లే మార్గంలో కొంతదూరం చదును చేసి కంకర మిశ్రమాన్ని పోసి బీటీ వేయడం విస్మరించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొమురవెల్లి శివారులో రైల్వే గేట్‌వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేస్తుండటంతో రాజీవ్‌రహదారికి వెళ్లేమార్గాన్ని నిలిపివేశారు. దీంతో కొద్దిరోజులుగా గౌరాయపల్లి గ్రామం మీదుగా రాజీవ్‌రహదారికి చేరుకుంటున్నారు. మల్లన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సిద్దిపేట వైపు నుంచి వచ్చే భక్తులు ఈ మార్గం గుండానే వస్తుండటం, మూలమలుపు వద్ద కంకర వెదజల్లుతుండటంతో ఇబ్బందులుపడుతున్నారు. రైల్వే అండ్‌పాస్ నిర్మాణానికి మరికొన్ని నెలల గడువు పట్టనున్న క్రమంలో గౌరాయపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రమాదహెచ్చరికలు ఏర్పాటుచేయడంతో పాటు బీటీవేసి ఇబ్బందులు తొలగించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.





గౌరాయపల్లి మార్గంలో బీటీ వేయని దృశ్యం, ప్రమాదకరంగా మారిన గౌరాయపల్లి క్రాస్‌రోడ్డు

మంత్రి ఆదేశంతో హమాలీలకు రక్తపరీక్షలు



ఆసుపత్రిలో రక్త పరీక్షల కోసం వచ్చిన హమాలీ కార్మికులు

హుస్నాబాద్, జనవరి 20: మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్, ఆదర్శ హమాలీ సంఘాలకు చెందిన దాదాపు 210 మంది కార్మికులకు శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్మికులకు దాదాపు 50 రకాల రక్త పరీక్షలు చేశారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ హమాలీ కార్మికులతో సమావేశమై ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అన్ని రకాల రక్త పరీక్షలు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, అంబేడ్కర్ హమాలీ సంఘం అధ్యక్షుడు పున్న రాజమౌళి, సారయ్య తదితరులున్నారు.

ఈ నెల 22న సెలవు ప్రకటించాలి

● పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ

సిద్దిపేట క్రైం, జనవరి 20: ఈ నెల 22వ తేదీ అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సెలవు ప్రకటించాలని పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి మల్లుగారి ఇంద్రసేనారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయోధ్య వేడుకల్లో రాష్ట్రంలో, దేశంలో కుల, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అందరూ పాల్గొంటున్నారని తెలిపారు. అందరూ తమ ఇళ్లలో, గ్రామాల్లో, సామూహిక వేడుకల్లో పాల్గొనడానికి వీలుగా ఈ నెల 22న సెలవు ప్రకటించాలని శశిధర్ శర్మ, ఇంద్రసేనారెడ్డి కోరారు.

డీటీఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక, జనవరి 20: ఉపాధ్యాయ సమస్యలను నూతన ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సంఘం నేతలతో మాట్లాడి పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా నాయకుడు బాకీ చంద్రభాను పేర్కొన్నారు. 2024 క్యాలెండర్‌ను శనివారం దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిని, యాదగిరి, కిరణ్ మై, ఏసు మనీ, భారతి, ఉమారాణి, లక్ష్మణ్, రాధాకృష్ణ, హైమావతి, శ్రీదేవి, జి. రజిని, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి యువకుడి బలవన్మరణం



కనకయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 20. చెరువులో పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్ పరిధిలోని రాజిరెడ్డి పల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్ల కనకయ్య(37) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో శనివారం గ్రామ సమీపంలో ఉన్న చెరువు, పార్శికుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య కవిత, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గజ్వేల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పుస్తెలతాడు దొంగలించిన వ్యక్తి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ సురేందర్ రెడ్డి

సిద్దిపేట అర్బన్, జనవరి 20: ఓ మహిళ వద్ద పుస్తెల తాడు దొంగలించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ సురేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొండపాక మండలం దుద్దెడ మధిర సేలంపు గ్రామానికి చెందిన మల్లవ్వ ఈ నెల 18న సాయంత్రం ఐదు గంటలకు వ్యవసాయ పనులు చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బెదిరించి మూడు తులాలకు పైగా ఉన్న బంగారు పుస్తెలతాడును దొంగలించుకుపోయాడు. అదే రోజు 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు మేరకు మేరకు త్రీ టౌన్ సీఐ భాను ప్రకాష్ దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించిన ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన ఎండీ షాహిద్‌ను పట్టుకొని విచారించగా తానే పుస్తెలతాడును దొంగలించినట్లు ఒప్పుకున్నాడు. సిద్దిపేటలో తనకు తెలిసిన వ్యక్తి దగ్గర ఉంచినట్లు చెప్పడంతో అతడి వద్దకు వెళ్లి పుస్తెలతాడును రికవరీ చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన త్రీ టౌన్ సీఐ భాను ప్రకాష్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ ఎండీ అఫ్జల్, మంత్రి శ్రీనివాస్, ముత్తంగి స్వామి, సీసీ కెమెరా ఆపరేటర్ పరంధాములు, జగన్‌లను ఏసీపీ అభినందించారు.

రోడ్డును ఆక్రమించిన ప్రహరీ కూల్చివేత!

● మరింత డబ్బు ఇవ్వనందుకే కూల్చారని బాధితుడి ఆరోపణ

సిద్దిపేట టౌన్, జనవరి 20: ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకొని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే చర్యలు తప్పవని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ హెచ్చరించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని 12వ వార్డులోని రాఘవేంద్రనగర్ కాలనీలో పసుపు నూరి నిర్మల ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకొని, నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి నిర్మించిన ప్రహరీని మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ కాలనీవాసులు చేసిన ఫిర్యాదు మేరకు రోడ్డును ఆక్రమించి నిర్మించినందుకు గతంలోనే ప్రహరీని కూల్చివేశామని, అయితే ఇటీవల మళ్లీ అదేవిధంగా రోడ్డును ఆక్రమిస్తూ ప్రహరీని నిర్మించారని తెలిపారు. ఆ విషయమై స్థానికుడు ఉరుమడ్ల ఎల్లారెడ్డి ఫిర్యాదు చేయడంతో ఇంటి యజమానికి నోటీస్ ఇచ్చామన్నారు. నోటీసును బేఖాతరు చేయటంతో మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసినట్టు తెలిపారు. కాగా బాధితుడు మాట్లాడుతూ ఇంటి నిర్మాణ సమయంలో స్థానికంగా ఉండే ఓ నాయకుడు రూ. 2 లక్షలు డిమాండ్ చేయడంతో తాను ఇచ్చినట్లు తెలిపాడు. లంచం కింద మరింత డబ్బు కావాలని డిమాండ్ చేయగా తాను ఇవ్వకపోవడం వల్లే తమ ఇంటి ప్రహరీని కూల్చివేశారని ఆరోపించారు. ఈ విషయమై కాంగ్రెస్‌పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. బాధితుడికి న్యాయం కల్పించేవరకూ తాము అండగా ఉంటామన్నారు.

29న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక

సిద్దిపేటరూరల్, జనవరి 20: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాల యాజమాన్య నిర్వహణ కమిటీ ఈ నెల 29న ఎంపిక చేయనున్నట్టు సిద్దిపేట రూరల్ మండలంలోని ఇరుకోడు గ్రామంలో గల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సామలేటి బుచ్చిబాబు తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా ఈ కమిటీ ఎంపికకు హాజరుకావాలని కోరారు.

భారత రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు

దుబ్బాక, జనవరి 20: ఈనెల 26న భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం దుబ్బాక మండలం రాజక్కపేట, లచ్చపేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లోని విద్యార్థులకు డీటీఎఫ్ టీమ్ శేఖర్ ఆధ్వర్యంలో భారతరాజ్యాంగంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేటరూరల్, జనవరి 20: సిద్దిపేట డివిజన్ పరిధిలోని అర్బన్ మండలంలో గల ఎన్సాన్‌పల్లి, ప్రభుత్వ మెడికల్ కళాశాల, మందపల్లి పరిధిలోగల డీఎక్స్‌ఎన్ కంపెనీ, మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామాల పరిధిలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని సిద్దిపేట ఇన్‌చార్జి డీఈ శ్రీనివాసులు తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా 11కేవీ, 33కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చుతున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు క్రీడా పోటీలు

గజ్వేల్, జనవరి 20: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులకు డిపో మేనేజర్ బి.సురేఖ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ ఆదేశాల మేరకు 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కాగా టోర్నమెంట్‌లో మెకానిక్ సిబ్బంది, డ్రైవర్స్ కండక్టర్స్ జట్లు పోటీపడగా డ్రైవర్స్ కండక్టర్స్ జట్టు విజయం సాధించింది. వారితో డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్ కనకలక్ష్మి, మెకానికల్ సూపర్‌వైజర్ జమీల్, ఆఫీస్ సూపర్‌వైజర్ జె.పాల్, సివిల్ ఇంజనీర్ నాగేందర తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి



మినాజీపేటలో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్

వర్గల్, జనవరి 20: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ పేర్కొన్నారు. శనివారం వర్గల్ మండల పరిధిలోని మినాజీపేట, చౌదర్‌పల్లి, వర్గల్, వేలూర్, అనంతగిరిపల్లి, నాచారం గ్రామాలలో ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఓటర్ జాబితాలో పేరును వివరాలను సరిచూసు కోవాలన్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బీఎల్‌వోల వద్ద వివరాలను పరిశీలించుకోవచ్చన్నారు. జాబితాలో పేరు గల్లంతయితే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికిరణ్‌కుమార్, ఆర్‌ఐలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

● **రాయపోల్:** మండలంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను రాయపోల్ తహసీల్దార్ దివ్య, ఎంపీడీవో మునెయ్య శనివారం పరిశీలించారు. మండలంలోని ఆయా కేంద్రాలను పరిశీలించిన వారు మాట్లాడుతూ బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు కరపత్రాలను విడుదల చేశారు. ఆదివారం సైతం ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

● **మద్దూరు:** మద్దూరు మండలంలోని పలు గ్రామాల్లో బూత్ లెవల్లో బీఎల్‌వోల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను శనివారం తహసీల్దార్ అనంతరెడ్డి సందర్శించారు. మండలంలోని గ్రామాల్లో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలి

చిన్నకోడూరు, జనవరి 20: నాణ్యమైన మల్బరీ ఆకు ఉత్పత్తి కోసం నేలలో సేంద్రియ ఎరువులను విరివిగా వాడుకోవాలని పట్టు పరిశోధనాకేంద్రం సీనియర్ శాస్త్రవేత్తలు సీఎం బాబు, మహేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చంద్లాపూర్ గ్రామంలో పట్టు సాగులో అవలంభిస్తున్న యాజమాన్య పద్ధతులపై శనివారం నిర్వహించిన క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమానికి సూర్యాపేట రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాటాడుతూ.. పట్టు తోటలకు రసాయన ఎరువులను వాడాల్సి వస్తే శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులో వాడుకోవాలని, మోతాదుకు మించి వాడితే దుష్పరిణామాలు వస్తాయని రైతులకు సూచించారు. పట్టుపురుగుల పెంపకంలో ఆకు నాణ్యతతో పాటు, యాజమాన్య పద్ధతులు కీలకమన్నారు. పట్టు సాగులో తాను అలంబిస్తున్న నూతన సాంకేతిక పద్ధతులపై గ్రామానికి చెందిన రైతు పెద్దోళ్ల ఐలయ్య రైతులకు వివరించారు. అనంతరం మల్బరీ ఆకును కోసి కట్టలు కట్టే యంత్ర పరికరం పనితీరును రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ములుగు ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ రాఘవేందర్, గండిపల్లి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మాధురి, పట్టు పరిశ్రమ అధికారులు రవి ప్రసాద్, ఇంద్రసేనారెడ్డి, వీరకుమార్, పట్టు రైతుల సహకార సంఘం ప్రతినిధులు ఐలయ్య, నర్సింహులు, వెంకట్రాంరెడ్డి, రాజు, సంతోష్ కుమార్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైసూరు పట్టు పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త సీఎం బాబు

రైతులకు నీళ్లివ్వకుంటే పోరాటమే



దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌లో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాయపోల్, జనవరి 20: మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల ద్వారా యాసంగి సీజన్‌లో రైతులకు నీళ్లు ఇవ్వకుంటే పోరాటం చేస్తానని దుబ్బాక శాసనసభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్, సూరంపల్లి, బందారం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన ఇందుప్రియాల్‌లో కొండపోచమ్మ నుంచి చిన్న శంకరంపేటకు వెళ్లే కాలువను పరిశీలించారు. దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నీరు అందేలా మల్లన్నసాగర్‌ను గత ప్రభుత్వం నిర్మించిందని, రైతులు నీళ్లు, కరెంట్ వస్తాయో, లేదోననే అయోమయంలో ఉన్నారన్నారు. నీళ్లు లేవు అనే సాకుతో రైతులకు సాగు నీరు ఇవ్వకుండా చేసే ప్రయత్నాన్ని అడ్డుకుంటామన్నారు. పొలాలు ఎండిపోయే దుస్థితిలో ఉన్నాయని, వెంటనే నీటిని విడుదల చేయాలన్నారు. రైతులకు నీళ్లు ఇవ్వని పక్షంలో రైతుల పక్షాన పోరాటం చేస్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ గంగాధరి సంధ్యరవి, జడ్పీటీసీ రణం జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి, తదితరులు ఉన్నారు.

ఆలయాలను శుభ్రంగా ఉంచాలి

● అయోధ్యలో రాంలల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు

హుస్నాబాద్, జనవరి 20: ఆలయాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పేర్కొన్నారు. ఈ నెల 22న అయోధ్యలో రామ్ లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని శనివారం హుస్నాబాద్ పట్టణంలోని శివాలయం వద్ద స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్‌లోని గోదాంగడ్డ అంజనేయస్వామి ఆలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా హుస్నాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రామ నామం ఆకారంలో మానవ హారాన్ని ఏర్పాటు చేసి అయోధ్య రామ మందిర విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

● **వర్గల్:** ఈ నెల 22వ అయోధ్యలో జరిగే రాం లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రజలంతా పండుగలా చేసుకోవాలని వర్గల్ జడ్పీటీసీ బాలు యాదవ్ పేర్కొన్నారు. శనివారం వర్గల్‌లో శ్రీరాముడి జెండాలను భక్తు బృందం సభ్యులతో కలిసి ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు యతీష్‌గౌడ్, నాగరాజు, హరిబాబు, సురేశ్, భద్రీనాథ్, గణేశ్, దుర్గేష్ తదితరులు ఉన్నారు.



హుస్నాబాద్ శివాలయంలో శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత తదితరులు

● **చేర్యాల:** అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చేర్యాల పట్టణంలోని రామాలయంలో సీతా రామ,లక్ష్మణ,హనుమత్ దేవతా విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పట్టణవాసులు తమ ఇంటి నుంచి కలశాలలో పంచామృతాలు తీసుకువచ్చి అభిషేకించారు. అనంతరం 1990-92లో కరసేవకులుగా వెళ్లిన మేక బాలసిద్దయ్య, ఆయితరాజు ఉదయప్రకాశ్, అంకుగారి శశిధర్‌రెడ్డి, పుర్మ సంజీవరెడ్డి, బూరుగు కనకయ్యలను రామాలయ నిర్వాహక కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

బీఆర్ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా మెదక్ ఎంపీ సీటు కాంగ్రెస్‌కే ఖాయం

● యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి

గజ్వేల్, జనవరి 20: బీఆర్ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసిన మెదక్ ఎంపీ సీటు కాంగ్రెస్ పార్టీదేనని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హరితా రెస్టారెంట్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు ఓటమిపై ఆత్మ పరిశీలన చేసుకోకుండా ఓటమికి ప్రజలదే తప్పు అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ వైపు నిలబడడం ఖాయమని, మెదక్ పార్లమెంట్‌పై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆయనతో నాయకులు అజ్జర్, సుదర్శన్, సమీర్, డప్పు గణేశ్, అహ్మదీపూర్ బాలాగౌడ్, మామిడ్యాల ఆంజనేయులు ఉన్నారు.

ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్, జనవరి 20: ధరణి పోర్టల్ ద్వారా ఉత్పన్నమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ధరణి సమస్యలను పరిష్కరించాలని, భూ రికార్డులను సరిచేయాలన్నారు. రైతు రుణమాఫీ, రైతుబంధును వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. కొన్నేళ్లుగా ధరణి సమస్యలను పరిష్కరించాలని రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. ధరణికి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసి రైతుల భూ రికార్డులను సరిచేయాలన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకులు కనకయ్య, ఐలయ్య, వెంకటేశ్ ఉన్నారు.

సీసీ రోడ్ల పనులను నాణ్యతతో చేపట్టాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, జనవరి 20: సీసీ రోడ్ల నిర్మాణాన్ని నాణ్యతతో చేపట్టాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన స్థానిక కౌన్సిలర్ బొగ్గుల చందుతో కలసి పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట నాయకులు బాకి స్వామి, కరీం, అటకూరి స్వామి ఉన్నారు.

తెలంగాణ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టిన సీఎం

సిద్దిపేట టౌన్, జనవరి 20: తెలంగాణ రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పూజల గోపికృష్ణ పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన విజయవంతం చేశారని, మూడు రోజుల్లో 200 సంస్థలతో సంప్రదింపులు జరిపి తెలంగాణకు పెట్టుబడులు తీసుకవస్తున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ న్యాయం చేస్తుందన్నారు.కార్యక్రమంలో నాయకులు మున్నా, వాహబ్, అజ్మత్, ఇమ్రాన్, బబ్బు, శ్రీనివాస్, వంశీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 29 వరకు

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో స్టడ్స్ అండ్ డ్రాప్స్ ఉత్సవం



సిద్దిపేట మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో కేక్‌కట్ చేస్తున్న వినియోగదారులు, సిబ్బంది

సిద్దిపేట టౌన్, జనవరి 20: ఈ నెల 20 నుంచి 29 వరకు సిద్దిపేట పట్టణంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో స్టడ్స్ అండ్ డ్రాప్స్ ఉత్సవం నిర్వహించనున్నట్లు షోరూం మేనేజర్ షరీక్ షరఫ్ తెలిపారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం రెండో వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, స్థానిక మహిళలు, వినియోగదారులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజర్ షరీక్ షరఫ్ మాట్లాడుతూ పట్టణంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం వార్షికోత్సవం సందర్భంగా వేలాది రకాల ప్రత్యేకమైన స్టడ్స్ అండ్ డ్రాప్స్ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు చెప్పారు.